క్లుప్తంగా

ఆదిత్య గణపతిని దర్శించుకున్న వాసుపల్లి



ఆదిత్య గణపతిని దర్శించుకుంటున్న వాసుపల్లి గణేష్‌కుమార్

అల్లిపురం : నీలమ్మ వేపచెట్టు దరి శ్రీ నీలమాంబ యూత్ అసోసియేషన్, జీకే ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆదిత్య గణపతిని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గం సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ ఆదివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు అసోసియేషన్ అధ్యక్షుడు భీశెట్టి గోపీకృష్ణ, కమిటీ సభ్యులు స్వాగతం పలికారు. గణపతి వద్ద విశేష పూజా కార్యక్రమాల అనంతరం వాసుపల్లికి స్వామివారి శేష వస్త్రంతో పాటు ప్రసాదం అందజేశారు.

ఘనంగా అన్నసమారాధన



అన్నసమారాధనలో పాల్గొన్న పచ్చిరిపల్లి రాము తదితరులు

అల్లిపురం : పిల్లివారివీధిలో శ్రీ కోదండరామాలయం యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం అన్నసమారాధన కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 33వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి పచ్చిరిపల్లి రాము పీవీఎన్ రెడ్డి, బాబ్జి, సుందర్, పిల్లి శ్రీను తదితరులతో కలిసి అన్నసమారాధన కార్యక్రమం ప్రారంభించారు. సుమారు 2 వేల మందికి అన్నసమారాధన చేపట్టారన్నారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అన్నప్రసాదం స్వీకరించారు.

వసతి గృహానికి నిరాశ్రయుల తరలింపు



టీఎస్ఆర్ కాంప్లెక్స్‌లోని ఏయూటీడీ వసతి గృహంలో నిరాశ్రయులు

సీతమ్మధార : నగరంలోని పలు ప్రాంతాల్లో జీవనం సాగిస్తున్న పదిహేను మందిని ద్వారకానగర్‌లోని ఏయూటీడీకీ తరలించారు. రైల్వే స్టేషన్, ఆర్టీసీ కాంప్లెక్స్ పరిసర ప్రాంతాల్లో జీవనం సాగిస్తున్న వారిని ఆర్‌పీఎఫ్ సిబ్బంది, ఏయూటీడీ సంయుక్తంగా టీఎస్ఆర్ కాంప్లెక్స్‌లోని వసతిగృహానికి తరలించారు. వీరిలో మానసిక రోగులు, వృద్ధులు, ఇల్లు వదిలి వచ్చేసిన వారు ఎక్కువగా ఉన్నారు. వీరందరికీ వైద్యం చేసిన తర్వాత కుటుంబ సభ్యులకు అప్పగిస్తామని షెల్టర్ మేనేజర్ జ్యోతిర్మయి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌పీఎఫ్ సీఐ రామకృష్ణ, షెల్టర్ అధికారి భాస్కరరావు తదితరులు ఉన్నారు.

తైక్వాండో క్రీడాకారుడికి సత్కారం



తైక్వాండో క్రీడాకారుడు ప్రకాశరావు, కోచ్ రుక్మాకరరావులను సత్కరిస్తున్న దృశ్యం

గోపాలపట్నం: తైక్వాండో క్రీడలో విశేష ప్రతిభ కనబరిచిన మలిపర్తి ప్రకాశరావుతో పాటు కోచ్ పాండ్రంకి రుక్మాకరరావుకు ఘన సత్కారం లభించింది. ప్రకాశరావు ఈ నెల 26 నుంచి 30 వరకు మలేషియాలో జరగనున్న తైక్వాండో పోటీలకు వెళ్తున్న సందర్భంగా ఉచిత శిక్షణ ఇచ్చిన రుక్మారరావును ఆక్సిజన్ టవర్స్ ప్రెసిడెంట్ తిరుపతిరాజు, ఎలియన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ గవర్నర్ డి. పోలారావు ఘనంగా సత్కరించారు.

భవితకు దిక్సూచి

విజ్ఞానాభివృద్ధికి గ్రంథాలయాలు ఎంతగానో దోహదపడుతున్నాయి. సమస్త సమాచారాన్ని నిక్షిప్తం చేసుకున్న ఎన్నో అరుదైన గ్రంథాలు లైబ్రరీల్లో పొందుపరచబడ్డాయి. కళలు, ఆధ్యాత్మికం, సైన్స్, దేశ చరిత్రలు, ప్రముఖుల బయోగ్రఫీ, ఆటలు ఇలా పలు అంశాలకు సంబంధించిన గ్రంథాలకు నిలయం గ్రంథాలయాలు. అలాగే సాహిత్యాభిలాష గల పాఠకులు మెచ్చే కథల పుస్తకాలు, నవలలు కూడా గ్రంథాలయాల్లో మనకు లభ్యమవుతాయి. పిల్లల కామిక్ పుస్తకాలు కూడా లైబ్రరీల్లో చూడొచ్చు. అలాగే వివిధ పోటీ పరీక్షలకు తర్ఫీదు పొందే విద్యార్థులకు కావాల్సిన సబ్జెక్టు పుస్తకాలు కూడా గ్రంథాలయాల్లో దొరుకుతున్నాయి. ఆ కోవకు చెందిన గ్రంథాలయమే అల్లిపురంలోని బాయమ్మ గ్రంథాలయం. ఇది అన్ని రకాల గ్రంథాలతో చదువరుల మనసు దోచుకుంటోంది.



కాంపిటీటివ్ బుక్స్ చదువుకుంటున్న ఉద్యోగార్థులు

- ఉద్యోగార్థులను తీర్చిదిద్దుతున్న అల్లిపురం శాఖా గ్రంథాలయం
- అందుబాటులో కాంపిటీటివ్ పుస్తకాలు
- సాహిత్యాభిలాషులకూ విలువైన గ్రంథాలు

అల్లిపురం : నిరుద్యోగ యువతకు అల్లిపురం శాఖా గ్రంథాలయం దిక్సూచిగా మారింది. ప్రస్తుతం ఉద్యోగం పొందాలంటే తప్పనిసరిగా ఇతరులతో పోటీ పడాల్సిందే. అందుకు ఎంతో ఖరీదైన పుస్తకాలు కొని చదువుకోవాల్సి ఉంటుంది. ఈ పరిస్థితిలో విద్యార్థులు చదువుకోవడానికి వీలుగా గ్రంథాలయ సంస్థ వారికి అవసరమైన పోటీ పరీక్షల పుస్తకాలను వేలాది రూపాయలు వెచ్చించి సమకూర్చింది. టీవీలు, సెల్‌ఫోన్లు వచ్చిన తర్వాత కూడా గ్రంథాలయాలకు ఆదరణ తగ్గలేదని అల్లిపురం శాఖా గ్రంథాలయాన్ని చూస్తే అర్థమవుతుంది. ఈ గ్రంథాలయానికి విద్యార్థులు, సాధారణ పాఠకుల తాకిడి ఎప్పటిలాగే ఉందని గ్రంథాలయ పాలకులు చెబుతున్నారు.

7200 పైచిలుకు పుస్తకాలు..

అల్లిపురంలోని బాయమ్మ జంక్షన్‌లో జిల్లా గ్రంథాలయానికి అనుబంధంగా శాఖా గ్రంథాలయం నిర్వహిస్తున్నారు. ఇందులో ఇప్పటికే 6,300 పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. వాటికి తోడుగా ఇటీవల మరో 975 కాంపిటీటివ్ పుస్తకాలు సమకూర్చినట్లు గ్రంథాలయాధికారి పీవీఎన్ రాజు తెలిపారు. వాటిలో బాల సాహిత్యం, పురాణాలు, ప్రముఖుల జీవిత చరిత్రలు, పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే విద్యార్థులకు ఉపయోగపడే పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని ఆయన తెలిపారు. త్వరలోనే మరికొన్ని పుస్తకాలు సమకూరుస్తామని పేర్కొన్నారు. శాఖా గ్రంథాలయంతో పాటు కేంద్ర గ్రంథాలయంలో అన్ని రకాల కాంపిటీటివ్ పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. విద్యార్థులు, పాఠకులు గ్రంథాలయ సేవలు వినియోగించుకోవాలని ఆయన కోరారు.

తెరిచి ఉండే వేళలు..

అల్లిపురం శాఖా గ్రంథాలయం ప్రతి రోజు ఉదయం 8 నుంచి 11 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి రాత్రి 7 గంటల వరకు తెరిచి ఉంటుందని గ్రంథాలయాధికారి రాజు తెలిపారు. పేపర్ విభాగం దిగువ భాగంలో, పుస్తక విభాగం మేడపైన నడుపుతున్నారు. ప్రతి శుక్రవారం సెలవు దినం. మిగిలిన రోజుల్లో కాంపిటీటివ్ పరీక్షలకు సిద్ధపడే వారు కోరితే పుస్తక విభాగం తెరచి ఉంచుతారు. పాఠకులు నవలలు ఇంటికి తీసుకెళ్లి చదువుకునేందుకు వెసులుబాటు కల్పించారు. అందుకు గాను రూ.100 డిపాజిట్ చేసుకుని కోరిన నవలలు అందజేస్తారు. ఈ అవకాశాన్ని సాహితీప్రియులు వినియోగించుకోవాలని గ్రంథాయాధికారి కోరుతున్నారు.



పోటీ పరీక్షల పుస్తకాలు



అల్లిపురం బాయమ్మ జంక్షన్‌లో గల శాఖా గ్రంథాలయం

అన్ని రకాల పత్రికలు అందుబాటులో..



శాఖా గ్రంథాలయంలో దిన, వార, మాస పత్రికలు లభిస్తున్నాయి. గ్రంథాలయానికి వచ్చి అన్ని రకాల పత్రికలు చదువుకోగలుగుతున్నాం. ఈ గ్రంథాలయాన్ని అందరూ వినియోగించుకుంటే బాగుంటుంది. అలాగే నవలలు, ఆధ్యాత్మిక గ్రంథాలు కూడా ఇక్కడ ఉన్నాయి. పిల్లలు మెచ్చే కథల పుస్తకాలు, బొమ్మలు, కార్టూన్ బుక్స్ కూడా అందుబాటులో ఉన్నాయి.

– పాల శ్రీహరిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకుడు

మరిన్ని పుస్తకాలు సమకూర్చుతాం..



గ్రంథాలయంలో 7200 పైగా పుస్తకాలు ఉన్నాయి. పోటీ పరీక్షలకు కావాల్సిన అన్ని పుస్తకాలు సమకూర్చాం. ఎవరైనా అవసరమైన పుస్తకాలు కావాలని తెలియజేస్తే వాటిని కూడా సమకూరుస్తాం. కొత్తగా మరికొన్ని పుస్తకాలు రానున్నాయి. విద్యార్థులు, పాఠకుల అభిరుచి మేరకు ఈ గ్రంథాలయం నిర్వహణ జరుగుతోంది. అందరూ గ్రంథాలయాన్ని వినియోగించుకోవాలి.

– పీవీఎన్ రాజు, గ్రంథాలయాధికారి

పేదలకు నిత్యావసర వస్తువుల పంపిణీ



నిత్యావసర సరకులు అందజేస్తున్న సుగుణరాణి

దాబాగార్డెన్స్ : సంఘ సేవకురాలు, నిత్యాన్నదాత కంచర్ల సుగుణరాణి 80వ జన్మదినోత్సవం ఆదివారం స్వామి వివేకానంద స్వచ్ఛంద సంస్థలో నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థలో ఆశ్రయం పొందుతున్న అనాథలు, ట్యూషన్ పిల్లలు, పరిసర ప్రాంతాల్లో గల పేదలకు మహాన్నదానం, అంధులు, వృద్ధులు, సంస్థ వలంటీర్లు, పలువురు పేదలకు బియ్యం, నిత్యావసర సరకులు అందజేశారు. వివేకానంద సంస్థ ట్యూషన్ పిల్లలకు గొడుగులు, పుస్తకాలు, బిస్కెట్లు, చాక్లెట్లు అందజేశారు. అనంతరం ఆమె సంస్థ ప్రాంగణంలో మామిడి మొక్క నాటారు. ఈ సందర్భంగా కంచర్ల రాంప్రసాద్ మాట్లాడుతూ అమ్మ జన్మదినోత్సవం అనాథాశ్రమంలో వృద్ధుల మధ్య జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. వివేకానంద సంస్థ అంటే తమ కుటుంబ సభ్యులకు ఎంతో అభిమానమని తెలిపారు. కార్యక్రమంలో కంచర్ల కుటుంబ సభ్యులు అన్నపూర్ణమ్మ, సుజాత, సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.


24న మాధవపెద్ది సురేష్‌కు సత్కారం

మద్దిలపాలెం: ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం 4వ వర్ధంతిని ఈనెల 24వ తేదీన మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించనున్నామని ప్రతాప్ తెలిపారు. ఆ రోజు సాయంత్రం 6.30 గంటల నుంచి బాలు గీతాలాపనతో సినీ సంగీత విభావరి ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో భాగంగా ప్రముఖ సంగీత దర్శకుడు మాధవపెద్ది సురేష్‌ను డాక్టర్ ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం సంగీత పురస్కారంతో సత్కరించనున్నామన్నారు. ఈ కార్యక్రమానికి నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంకర్ బ్రత బాగ్చీ, విశిష్ట అతిథిగా మాజీ స్పీకర్ యనమల రామకృష్ణుడు, మాజీ మంత్రి దాడి వీరభద్రరావు హాజరుకానున్నా రన్నారు. మిలీనియం శేఖర్ బృందంచే సినీ సంగతి విభావారి నిర్వహించనున్నామన్నారు.

పవిత్రోత్సవంలో విశేష పూజలు



కనకమహాలక్ష్మి అమ్మవారికి విశేష పూజలు నిర్వహిస్తున్న వైదిక సిబ్బంది



పవిత్రోత్సవాల్లో సిరులతల్లి

దాబాగార్డెన్స్ : పవిత్రోత్సవాల్లో భాగంగా ఆదివారం కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో విశేష పూజలు నిర్వహించారు. ఉదయం 8 నుంచి గణపతి పూజ, పుణ్యాహవాచన, సప్తకలశ ఆరాధన, అభిషేకం, ప్రధాన హోమాలు, నీరాజన మంత్ర పుష్పం జరిపారు. సాయంత్రం 6.30 నుంచి మహాశాంతి హోమం, నీరాజన మంత్ర పుష్పం జరిపారు. ఉత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం 8 గంటల నుంచి విశేష పూజలతో పాటు పవిత్ర విరమణ, మహాపూర్ణాహుతి, వేద ఆశీర్వచన చేయనున్నారు. మధ్యాహ్నం పంచామృతాభిషేకం అనంతరం 12.30 గంటల వరకు గర్భాలయ దర్శనాలు, ఆర్జిత సేవలు, శాశ్వత సేవలు నిలిపివేయనున్నట్టు ఆలయ ఈవో పి. శ్రీనివాసులరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఏఈవో వెంపలి రాంబాబు, ఆలయ పర్యవేక్షకులు, సిబ్బంది పాల్గొన్నారు.

మత్స్యకారులను ఆదుకోవాలి



ఒడ్డుకు చేరుకున్న మత్స్యకారులతో మత్స్యశాఖ జేడీ విజయ, మైలపల్లి లక్ష్మయ్య తదితరులు

మహారాణిపేట : విశాఖ తీరంలో బోటు అగ్నికి ఆహుతైన సమాచారం ప్రభుత్వానికి అందించినట్లు మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ ఎం.విజయ తెలిపారు. బోటు ప్రమాదంపై అన్ని వివరాలు సేకరించామన్నారు. దీనిపై విచారణ కూడా చేశామన్నారు.

మత్స్యకారులను ఆదుకోవాలి..

అగ్ని ప్రమాదానికి గురైన బోటు బాధితులను కూటమి ప్రభుత్వం ఆదుకోవాలని మత్స్యకార కార్పొరేషన్ మాజీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు అన్నారు. ఈ బోటు ప్రమాదం వల్ల రూ. 35 లక్షల ఆస్తి నష్టం సంభవించిందన్నారు. ప్రమాద సమయంలో బోటులో అయిదుగురు మత్స్యకారులు ఉన్నారని, ఇంకో బోటు సహాయం వల్ల వారు క్షేమంగా ఒడ్డుకు చేరుకున్నారని తెలిపారు. రాష్ట్ర మెకనైజ్డ్ ఫిషింగ్ బోటు ఆపరేటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మైలపల్లి లక్ష్మణరావు, గౌరవ అధ్యక్షుడు పి.సి.అప్పారావు ఆదివారం సాయంత్రం బాధితులను పరామర్శించారు. బోటు ఇంజిన్‌లో మంటలు చెలరేగడంతో ఈ ఘటన జరిగిందని, ఈ ఏడాది వేట ప్రారంభమయ్యాక ఇంత వరకు ఆరు బోట్లు ప్రమాదాలకు గురయ్యాయని తెలిపారు. ఈ ఘటనను విశాఖపట్నం లోక్‌సభ సభ్యుడు ఎం. శ్రీభరత్‌కు తెలియజేశామన్నారు. ఆయన వెంటనే స్పందించి ఈ విషయం ప్రభుత్వంతో మాట్లాడుతానని హామీ ఇచ్చినట్లు మైలపల్లి లక్ష్మణరావు చెప్పారు. ఈ కార్యక్రమంలో సురక్షితంగా ఒడ్డుకు చేరుకున్న మత్స్యకారులతో పాటు రాష్ట్ర ఫిషరీస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కోలా గురువులు, రాష్ట్ర మర పడవల సంఘం మాజీ అధ్యక్షులు పి.సి. అప్పారావు, అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సురపతి నర్సింగరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ గనగళ్ల రాజేష్, ఉపాధ్యక్షుడు మట్టా రాజు, సెక్రటరీ మున్నం బాలాజీ, జాయింట్ క్యాషియర్ బడే అనిల్, డిప్యూటీ ట్రాఫిక్ మేనేజర్ బి.కె. పట్నాయక్, డాక్ ఇన్‌స్పెక్టర్ లీలాప్రసాద్, చీకటి రమేష్, గరికిన రవి, మెరైన్ సీఐ పల్లా అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

సందడిగా స్టోరీ టెల్లింగ్



పిల్లలకు కథలు చెబుతున్న కథకులు వరలక్ష్మి

సీతంపేట: భారతీయ విద్యా భవన్స్ స్కూల్, విశాఖపట్నం పౌర గ్రంథాలయం సంయుక్తంగా ఆదివారం ఉదయం లైబ్రరీలోని మియావాకీ సెంటర్‌లో నిర్వహించిన స్టోరీ టైం విద్యార్థులను అలరించింది. ప్రముఖ కథకులు కె. వరలక్ష్మి రాజస్థానీ జానపద కథలతో చిన్నారులను మంత్రముగ్ధులను చేశారు. రాజస్థాన్ సంప్రదాయాలతో, సృజనాత్మకతతో, రాజస్థానీ తోలు బొమ్మలు, కథలు చెప్పి విద్యార్థులను ఆకట్టుకున్నారు. కథలకు సంగీత వాయిద్యాలను లయబద్ధంగా జోడించి పిల్లలు సైతం జత కలిపేలా కథలో లీనం చేశారు. నగరంలో వివిధ పాఠశాలల నుంచి సుమారు 60 మంది పిల్లలు పాల్గొని ఆసక్తిగా కథలు విన్నారు. అనంతరం పేపర్‌తో ఆర్ట్ అండ్ క్రాఫ్ట్, ఓరిగామి, వర్క్ షీట్ నింపడం, పిక్చర్ బుక్ వంటి యాక్టివిటీ చేయించారు.

ఆకట్టుకున్న భక్తి సంగీత విభావరి



కార్యక్రమంలో పాల్గొన్న గాయనీ గాయకులు

దాబాగార్డెన్స్ : గణపతి నవరాత్రి మహోత్సవాలను పురస్కరించుకుని సంపత్ వినాయగర్ దేవాలయంలో మెలోడీ క్రియేటర్స్‌చే నిర్వహించిన భక్తి సంగీత విభావరి భక్తులను ఆకట్టుకుంది. సంస్థ అధ్యక్షుడు సీహెచ్‌వీ సత్యనారాయణ, కార్యదర్శి ఎంవీ రాజశేఖర్ సారథ్యంలో సంగీత విభావరి సాగింది. కన్వీనర్ వి. ప్రభాకర్, ఎమ్మెస్ మాధవ్, పూర్ణిమ, సత్యశ్రీ, గ్రంధి సిస్టర్స్ తదితరులు ఆలపించిన భక్తి గీతాలు ఆకట్టుకున్నాయి. ఆర్గాన్‌పై సోమేష్, తబలాపై కరుణప్రసాద్, ప్యాడ్స్‌పై సత్యం వాద్య సహకారం అందించారు.

వరసిద్ధి వినాయకునికి ఘనంగా పూజలు



దొండపర్తిలో వరసిద్ధి వినాయకుని సన్నిధిలో కోలా గురువులు

సీతమ్మధార : దొండపర్తి రామాలయం సమీపంలో శ్రీ వరసిద్ధి వినాయక పూజా మహోత్సవ కమిటీ ఆధ్వర్యంలో వినాయక చవితి ఉత్సవాలు కమిటీ అధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ 27వ వార్డు అధ్యక్షుడు నీలాపు సర్వేశ్వరరెడ్డి పర్యవేక్షణలో ఘనంగా జరుగుతున్నాయి. ఆదివారం రాత్రి పార్టీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు హాజరై గణపతికి పూజలు చేశారు. ఇక్కడ ఏర్పాటు చేసిన శివ, పార్వతులతో కూడిన వినాయక ప్రతిమ భక్తులను విశేషంగా ఆకట్టుకుంటుంది. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, భక్తులు, నిర్వాహకులు పాల్గొన్నారు.

చిరస్మరణీయుడు రామచంద్రమూర్తి



రామచంద్రమూర్తి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కళారంగ ప్రముఖులు

దాబాగార్డెన్స్ : రామ్‌నగర్ మెయిన్‌రోడ్డులో గల రాఘవేంద్రస్వామి ఆలయంలో గల సమావేశ మందిరంలో ఐవీఎల్ శాస్త్రి సంగీత సమితి నేతృత్వంలో ఇటీవలే పరమపదాన్నొదైన ఇంద్రగంటి రామచంద్రమూర్తి సంస్మరణ సభ ఆదివారం నిర్వహించారు. ముందుగా సమితి కార్యవర్గ సభ్యులు ఆకొండి వెంకట్రావు, కె. సుబ్రహ్మణ్యం, పి. జగన్‌మోహన్‌రావు తదితరులు రామచంద్రమూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నిర్వహించిన సంస్మరణ సభలో వీవీ శంకరం మాట్లాడుతూ ఆధ్యాత్మిక రంగానికి, సంకీర్తన వైభవానికి తనదైన శైలిలో విశిష్ట సేవలందించిన ఇంద్రగంటి రామచంద్రమూర్తి సదా చిరస్మరణీయుడని పేర్కొన్నారు. ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్ మాట్లాడుతూ తన పరిపూర్ణమైన జీవితాన్ని భజన సాంప్రదాయం కోసం అంకితం చేసిన ఘనత రామచంద్రమూర్తికే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో రామచంద్రమూర్తి కుమార్తెలు డాక్టర్ గాయత్రి, గీత, మధుబాబు, మధుసూదనరావు, నాగేశ్వరరావు, డాక్టర్ దీప్తి, శేఖర్, ఇంద్రసేన్, కృష్ణారావు, ముఖేష్, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సీతాకోక చిలుకా.. నీవెక్కడ?

- జూలో నిర్లక్ష్యానికి గురైన బటర్‌ఫ్లై పార్క్
- పునరుద్ధరించాలని సందర్శకుల వినతి



జూలో వినియోగంలో లేని సీతాకోక చిలుకల పార్క్

ఆరిలోవ: ఇందిరాగాంధీ జూ పార్క్‌లో సీతాకోకచిలుకల పార్క్ మూలకు చేరింది. కొన్నేళ్ల నుంచి జూ అధికారులను ఈ పార్క్‌ను పట్టించుకోవడం లేదు. ఒకప్పుడు వందలకొద్దీ సీతాకోకచిలుకలు సందర్శకులను అలరించేవి. ఇప్పుడు అవి కనిపించడం లేదు. జూలో నీటి ఏనుగుల ఎన్‌క్లోజర్ ఎదురుగా 2012లో సీతాకోకచిలుకల పార్క్ ఏర్పాటు చేశారు. 2014లో వచ్చిన హుద్‌హుద్ తుపానులో ఇది నాశనమైంది. 2015లో ఈ పార్క్‌ను పునరుద్ధరించారు. అప్పటి నుంచి సందర్శకులకు అందుబాటులో ఉన్న ఈ పార్క్ మూడేళ్ల కిందట మళ్లీ మరమ్మతులకు గురైంది. సీతాకోకచిలుకలు బయటకు ఎగిరిపోవడానికి వీలులేకుండా ఏర్పాటు చేసిన మెష్ చిరిగిపోయింది. అప్పటి నుంచి జూ అధికారులు దీనికి మరమ్మతులు మాత్రమే చేపడుతున్నారు. పూర్తి స్థాయిలో పునరుద్ధరించడం లేదు. తరచూ మరమ్మతులకు గురవుతున్న ఈ పార్క్‌పై అధికారులు నిర్లక్ష్యం చూపడంతో ప్రస్తుతం వినియోగంలో లేదు. పైకప్పుపై మెష్ లేకపోవడంతో ఇందులో సీతాకోకచిలుకలు బయటకు వెళ్లిపోయాయి. రెండేళ్లుగా జూలో వివిధ అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. కొన్ని సంస్థలు అందించిన సీఎస్సార్ నిధులతో ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేశారు. కొత్తగా మరుగుదొడ్ల నిర్మాణం, వన్యప్రాణులకు సంబంధించిన నైట్‌క్రాల్స్ నిర్మాణాలు చేపట్టారు. పిల్లలు, పెద్దలను అలరించే సీతాకోకచిలుకల పార్కుపై మాత్రం అధికారులు నిర్లక్ష్యం చూపతున్నారని సందర్శకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీన్ని పునరుద్ధరించాలని కోరుతున్నారు.

3 నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు

ఉక్కునగరం: శ్రీమహాదుర్గ, శ్రీమహాలక్ష్మి, శ్రీమహాసరస్వతి వెలసిన ఉక్కునగరంలోని త్రిశక్తి దేవాలయంలో అక్టోబర్ 3 నుంచి శ్రీదేవి శరన్నవ రాత్రి ఉత్సవాలు ప్రారంభమవుతున్నాయి. 12 వరకు వివిధ పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా 4న సహస్ర సంపెంగ పుష్పార్చన, 5న సహస్ర హస్త కంకణార్చన, 6న సహస్ర హరిద ఖండార్చన నిర్వహించనున్నారు. 7న సహస్ర కమల పుష్పార్చన, 8న సహస్ర కలువ పుష్పార్చన, 9న సామూహిక అక్షరాభ్యాసాలు, సాయంత్రం పిల్లలచే సామూహిక సరస్వతీ పూజ, సహస్ర శ్వేత కుసుమార్చన, 10న సహస్ర గులాబీ అర్చన, సాయంత్రం ఊంజల్ సేవ, సహస్ర దీపాలంకరణ సేవ నిర్వహించనున్నారు. 11న సహస్ర వివిధ ఫలార్చన చేయనున్నారు.

తొమ్మిది రోజుల పాటు ముగ్గురు అమ్మవార్లు వివిధ రూపాల్లో దర్శనమివ్వనున్నారు. భక్తులు ఉత్సవాల్లో పాల్గొని అమ్మవార్ల ఆశీస్సులు పొందాలని ఆయన ప్రధాన అర్చకుడు ఫణిశర్మ తెలిపారు.

నిల్వ ఉన్న మేక తలలు కొనుగోలు చేయొద్దు

వినియోగదారులకు వెటర్నరీ అధికారుల సూచన

ఆరిలోవ: నిల్వ ఉన్న మేక తలలు, బోటీలను కొనుగోలు చేయవద్దని వినియోగదారులకు జీవీఎంసీ వెటర్నరీ విభాగం అధికారులు సూచించారు. జాతీయ రహదారి పక్కన హనుమంతవాక వద్ద మేక తలలు, బోటీ విక్రయాలను ఆదివారం పరిశీలించారు. కొందరు అక్కడ ఐస్ బాక్స్‌లలో నిల్వ ఉన్న మేక తలలు, బోటీ విక్రయించడాన్ని గమనించి, స్వాధీనం చేసుకున్నారు. అక్కడే వాటిపై ఫినాయిల్ వేసి, డంపింగ్‌యార్డుకు తరలించారు. వాటిని అక్కడ గోతిలో పాతిపెడతామని తెలిపారు. ఈ సందర్భంగా వెటర్నరీ అధికారులు వినియోగదారులకు వాటిపై అవగాహన కల్పించారు. నిల్వ ఉన్న మేక తలలు తినడం వల్ల అనారోగ్యానికి గురవుతారని తెలిపారు. ఇక్కడ పాడైన మేక తలలు, బోటీ విక్రయిస్తే తమకు ఫిర్యాదు చేయాలని సూచించారు.

పాడైనవి విక్రయిస్తే కఠిన చర్యలు : పాడైపోయిన మేక తలలను విక్రయించే వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకుంటామని వెటర్నరీ అధికారులు హెచ్చరించారు. ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడవద్దన్నారు. ఇక్కడ వాటిని విక్రయించవద్దని, మేకల కబేళా వద్ద మాత్రమే, మంచివి విక్రయించాలని సూచించారు.

శాఖాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

గాజువాక: పిరమిడ్ స్పిరిచ్యువల్ ట్రస్టు అనుబంధ సంస్థ పరమాత్మ పిరమిడ్ ధ్యాన కేంద్రం ఆధ్వర్యంలో ఆదివారం శాఖాహార సద్భావన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని శ్రీనగర్ దరి దుర్గానగర్ జంక్షన్‌వద్ద పల్లా కార్తీక్ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ పల్లా కార్తీక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాఖాహారంతో ఆరోగ్యానికి అనేక ప్రయోజనాలు ఉన్నాయన్నారు. అనంతరం పిరమిడ్ సంస్థ సభ్యులు శాఖాహారం ప్రయోజనాలపై దుర్గానగర్ పరిసర ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో పిరమిడ్ ట్రస్టు ప్రతినిధులు బి.అప్పారావు, ఎం.శివగణేశ్వరరావు, టి.రేవతీదేవి, పద్మావతి, బాలాజీ, కనకారావు, అప్పలనర్సమ్మ, సత్యనారాయణ, సుబుద్ధి, అప్పలరాజు, దేవిక, వర్మరాజు తదితరులు పాల్గొన్నారు.